ప్రజాశక్తి

గురువారం 3 ఆగస్టు 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



జిజిహెచ్ మార్చురీ వద్ద ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు, సిఐటియు నాయకులు

శిక్షణకెళ్తూ మృత్యువాత

బస్సు ఢీకొని ఆశా కార్యకర్త, ఆమె సోదరుడు దుర్మరణం

ప్రజాశక్తి - తాడికొండ

రోడ్డు ప్రమాదంలో ఆశా కార్యకర్త, ఆమె సోదరుడు దుర్మరణం పాలైన ఘటన మండలంలోని లాం శివారు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మేడికొండూరు మండలం డోకిపర్రుకు చెందిన నల్లగొర్ల గోపిచంద్ (20), తన పెద్దమ్మ

▶ 2లో

ఎన్నికల ప్రక్రియలో తొలి అడుగు

- రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నియామకం
- గెజిట్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం ఉమ్మడి గుంటూరు జిల్లాలో రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వివిధ శాఖల అధికారులను ఎంపిక చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రిటర్నింగ్ అధికారులుగా జాయింట్ కలెక్టర్లు, ఆర్‌డీవోలు, రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్లను నియమించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సహకార శాఖ అధికారులను ఎంపిక చేశారు.

రిటర్నింగ్ అధికారులు వివరాలు ఇలాఉన్నాయి. పెదకూరపాడుకు పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, తాడికొండకు కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మంగళగిరికి గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టరు, వేమూరుకు జిల్లా పరిషత్ సిఇఒ, రేపల్లేకు రేపల్లె ఆర్‌డీవో, తెనాలికి తెనాలి సబ్ కలెక్టర్, బాపట్లకు బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టరు, ప్రత్తిపాడుకు గుంటూరు ఆర్‌డీవో, గుంటూరు పశ్చిమకు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు తూర్పు

▶ 2లో

కబ్జాల రాయుడు 'బొల్లా'

- విదేశాలకు పారిపోయినా లోపల వేయిస్తా
- పాదయాత్రలో ఎమ్మెల్యే బ్రహ్మనాయుడుపై లోకేష్ ఘాటు విమర్శలు



ప్రజాశక్తి-వినుకొండ

వినుకొండ ఎమ్మెల్యే ఇంటి పేరు బొల్లా.. కానీ చెప్పే మాటలు అన్ని డొల్ల అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. పల్నాడు జిల్లాలో నిర్వహిస్తున్న యువగళం పాదయాత్రలో భాగంగా రెండ్రోజులుగా నూజెండ్ల, వినుకొండ మండలాల్లో ఆయన పాదయాత్ర చేశారు. వినుకొండ పట్టణంలో బుధవారం సాయంత్రం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వినుకొండ నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను కబ్జా చేసిన కబ్జా రాయుడు బొల్లా బ్రహ్మనాయుడన్నారు. బ్రాహ్మణపల్లి రెవెన్యూ పరిధిలో 170 ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమించి కాజేశాడని, పసుపులేరు బ్రిడ్జి వద్ద 62 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు తెలిపారు. పట్టణంలోని ముస్లిం సోదరుడు ఫరీద్ కుటుంబానికి సర్వే నెంబర్ 214లో మూడు ఎకరాల భూమి ఉంటే ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు కబ్జా చేశాడని ప్రశ్నించిన ఫరీద్‌పై పోలీస్ స్టేషన్లో పెట్టి చితకబాదించాడని అన్నారు. తెల్లపాడులో శ్రీనుకు చెందిన ఎనిమిది ఎకరాల భూమిని ఎమ్మెల్యే కబ్జా చేశాడని ఆరోపించారు. వెంకుపాలెం వద్ద డెయిరీకి రోడ్డు వేసుకునేందుకు దళితులకు

▶ 2లో



సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

గుంటూరులో విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ భారీ ర్యాలీ

5లో



రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు

అట్రాసిటీ చట్టం కోరలు పీకే సంస్కరణలు

- స్టేషన్ బెయిల్ ఇవ్వడాన్ని ఆపాలి
- ప్రతి అవసరానికీ దళితుల భూములపైనే కన్ను
- త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా దళిత రక్షణ యాత్ర
- రౌండ్ టేబుల్ సమావేశంలో దళిత, ప్రజా సంఘాలు

2లో



శిక్షణకెళ్తూ మృత్యువాత

(మొదటి పేజీ తరువాయి)

కూమార్తె అయిన పెదకూరపాడు మండలం కంబంపాడుకు చెందిన మొక్కల గోవర్ధనీ (32) వద్దకు మంగళవారం వెళ్లాడు. గోవర్ధని ఆశ వర్కర్ నుండి ఎఎన్ఎంగా ప్రమోషన్ రావడంతో ట్రైనింగ్ నిమిత్తం కంబంపాడు నుండి గుంటూరు తన తమ్ముడితో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద రాగానే వీరి ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా త్రిబుల్ ఎక్స్ సబ్బుల కంపెనీకి చెందిన బస్సు ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నుండి కింద పడిన గోవర్ధని అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన గోపీని అంబులెన్సులో ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందాడు. మతురాలికి భర్త, ఇద్దరు పిల్లలున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. బస్సు డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సిఐటియు ఆందోళన

ప్రజాశక్తి-గుంటూరు

75 తాళ్లూరు పిహెచ్‌సిలో విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్ ఎం.గోవర్ధని ఆమె సోదరుడు గోపీచంద్ మృతి నేపథ్యంలో వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ జిజిహెచ్ మార్చురీ వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు ఆందోళన చేపట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి కార్యదర్శి వై.నేతాజీ, కార్యదర్శి లక్ష్మణరావు, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్, ఆశా వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి డి.శివకుమారి మాట్లాడారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే వారు చనిపోయారన్నారు. ఇద్దరికీ రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని, త్రిబుల్ ఎక్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే త్రిబుల్ ఎక్స్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఎన్నికల ప్రక్రియలో తొలి అడుగు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గానికి నగరపాలక సంస్థ కమిషనర్, చిలకలూరిపేటకు పులిచింతల స్పెషల్ కలెక్టర్, మాచర్లకు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్, గురజాలకు గురజాల ఆర్‌డీవో, సత్తెనపల్లికి సత్తెనపల్లి ఆర్‌డీవో, నర్సరావుపేటకు నర్సరావుపేట ఆర్‌డీవో, వినుకొండకు పల్నాడు జిల్లా పులిచింతల స్పెషల్ కలెక్టర్‌ను ఎంపిక చేశారు.

ఉమ్మడి జిల్లాగా ఉన్నపుడు గుంటూరు లోక్‌సభకు గుంటూరు జిల్లా కలెక్టరు, నర్సరావుపేట లోక్‌సభకు జిల్లా జాయింట్ కలెక్టరు, బాపట్లకు ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ రిటర్నింగ్ అధికారులుగా ఉండేవారు. డిప్యూటీ కలెక్టర్లు, ఇతర గ్రూపు-1 అధికారులు అసెంబ్లీ నియోజకవర్గాలకు రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించేవారు. ఇప్పుడు ముగ్గురు జిల్లా కలెక్టర్లు ఉండటం వల్ల మూడు లోక్‌సభ స్థానాలకు వారే రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారు. అయితే ఈసారి ముగ్గురు జాయింట్ కలెక్టర్లను కూడా మూడు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారులుగా నియమించడం గమనార్హం. ప్రస్తుతం ఓటర్ల రివిజన్ ప్రక్రియ కొనసాగుతోంది. రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను ఎన్నికల కమిషన్ నియమించడం ద్వారా సార్వత్రిక ఎన్నికలకు ఒక అడుగు పడినట్టయింది. త్వరలో ఒకే స్థానంలో రెండేళ్లకు పైగా పనిచేసిన వారిని బదిలీ, తదితర అంశాలపై మార్గదర్శకాలు విడుదలయ్యే అవకాశం ఉందని అధికారవర్గాలు భావిస్తున్నాయి. ప్రధానంగా ఎన్నికల విధుల్లో పాల్గొనే జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులకు ఈ మార్గదర్శకాలు వర్తిస్తాయని అధికారులు తెలిపారు.

విద్యా వ్యవస్థను దెబ్బతీస్తున్న విలీనం : యుటిఎఫ్

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతులను ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న పాఠశాలల్లో మ్యాపింగ్‌తో విద్యార్థులకు సబ్జెక్టు ఉపాధ్యాయులతో చెప్పిస్తామని చెప్పారని, ప్రాథమికోన్నత పాఠశాలలో 3,4 తరగతుల విద్యార్థులకు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతోనే బోధన చేపిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలల్లో 3వ తరగతి చదివే విద్యార్థికి హైస్కూల్లో ఒక రకమైన బోధన ఉన్నత పాఠశాలలో మరొక రకమైన బోధన జరగటం ఈ వ్యత్యాసం సరికాదని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ అన్నారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం ప్రాంతీయ శాఖ సమావేశం యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ జీవో 117 వలన ప్రాథమిక



మాట్లాడుతున్న యూట్యూబ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి ప్రేమ్ కుమార్

విద్యారంగం దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘాలు విద్యారంగ నిపుణులు మేధావులు చెప్పిన మాటలు ఇప్పుడు అక్షర సత్యం అయ్యాయని అన్నారు. 1,2 తరగతులలో ఒక టీచర్ తో నడుస్తున్న పాఠశాలల పట్ల ప్రజల విముఖత వ్యక్తం చేస్తూ ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ పాఠశాల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం తగ్గటమే ఎందుకు నిదర్శనమన్నారు. ఆగమేఘాల మీద బదిలీలు జరిపిన విద్యాశాఖ అధికారులు రెండు నెలలు పూర్తయిన క్యాడర్ స్ట్రెంత్ అప్డేట్ చేయటంలో చేసిన సమాచారం వలన ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు రాలేదని తెలిపారు. పల్నాడు జిల్లాలోని ఉన్నత పాఠశాలలో సబ్జెక్టు టీచర్ల పరిస్థితిలో విద్యాశాఖ శ్రద్ధ వహించాలన్నారు. జిల్లా సహాధ్యక్షులు ఎం.మోహన్‌రావు మాట్లాడుతూ విద్యారంగంలో సంస్కరణలు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే విధంగా ఉండాలేగాని నష్ట దాయకంగా కాదన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ ఎన్.సుందర్‌రావు మాట్లాడుతూ యాప్‌ల భారం విద్యా బోధనకు ఆటకంగా ఉంటుందని ఉపాధ్యాయున్ని బోధనలకు మాత్రమే పరిమితం చేస్తే విద్యా ఫలితాలు బాగుంటాయని చెప్పారు. నాయకులు ఒ.కోటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, వై.శ్రీనివాసరావు, పి.యోనా, షేక్ షరీఫ్, ఎం.రామాంజనేయులు, మల్లికా బేగం, జె.కార్మెల్ మేరీ, డి.నాగరాణి, కళ్యాణ్, డి.శ్రీనివాసరావు, ఎం.సాంబశివరావు, ఎస్.రామకృష్ణ, కె.రాఘవరావు పాల్గొన్నారు.

కబ్జాల రాయుడు 'బొల్లా'

(మొదటి పేజీ తరువాయి)



చెందిన ఎకరంన్నర భూమిని ఆక్రమించారని, ప్రభుత్వ భూములను ఆక్రమించి సెంటు స్థలాల పేరుతో మళ్లీ ప్రభుత్వానికి విక్రయించి రూ.20 కోట్లు అప్పనంగా కాజేశారని విమర్శలు గుప్పించారు. గుండ్లకమ్మ నది, వాగుల నుండి ఇసుక దోపిడీ, చెరువుల్లో భూముల్లో మట్టి దోపిడీ, బియ్యం, గుట్కా మాఫియా అన్ని ఎమ్మెల్యే కనుసన్నల్లోనే నడుస్తున్నాయని అన్నారు. వినుకొండలో ఏ పని జరగాలన్న ఎమ్మెల్యేకి 'బి' టాక్స్ చెల్లించాల్సిందేనని ఆరోపించారు. అభివృద్ధిలో వినుకొండ నాలుగేళ్ల క్రితం ఎక్కడ ఉందో ఇప్పుడూ అక్కడే ఉందన్నారు. పరిశ్రమల పేరుతో ప్రభుత్వ భూములను అక్రమ రిజిస్ట్రేషన్లతో కొట్టేసి వాటిపై రూ.వందల కోట్లు బ్యాంకు రుణాలు తెచ్చుకున్న వ్యక్తి బ్రహ్మనాయుడు అని విమర్శించారు. ఎమ్మెల్యే అవినీతి అక్రమాలు దౌర్జన్యాలు దోపిడీకి వినకొండ మున్సిపాలిటీ కేరాఫ్‌గా మార్చేశారని, బొల్లాపల్లి మండలంలో రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి 13 వేల ఎకరాలకు 8 వేల పాస్ పుస్తకాలు ఇప్పించి రూ.100 కోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. కబ్జారాయుడును ఓడించకపోతే వినుకొండలో ఎవరి భూమీ మిగలదని, కొండలు కూడా మింగేస్తారని అన్నారు. 9 నెలలు ఓపిక పడితే కబ్జాల రాయుడికి షాక్ ట్రీట్మెంట్ ఇచ్చే బాధ్యత తనదన్నారు. టిడిపి కార్యకర్తల జోలికి రావాలంటే భయపడే విధంగా చేస్తానని, చట్టాన్ని అతిక్రమించి అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. పోరాడిన ప్రతి కార్యకర్తని ఆదుకుంటామని, ఎక్కువ కేసులు ఉన్నవారికి పెద్ద నామినేటేడ్ పదవి ఇస్తానని ప్రకటించారు. కేసులకు భయపడేదే లేదని, టిడిపి నాయకుల్ని కార్యకర్తలు ఇబ్బంది పెట్టిన వాళ్ళు వినుకొండలో ఉన్నా, విదేశాలకు పారిపోయినా పట్టుకొచ్చి లోపల వేయిస్తానని హెచ్చరించారు. టిడిపి హయాంలో రూ.2400 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని, తాను మంత్రిగా ఉన్నప్పుడు ఎమ్మెల్యే అయిన జీవీ ఆంజనేయులు నిధుల కోసం తనతో పోట్లాడే వారిని చెప్పారు. మీరు పాలిచ్చే ఆవుని వద్దనుకొని తన్నే దున్నను తెచ్చుకున్నారని వ్యాఖ్యానించారు. వినకొండకు సిఎం జగన్ ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చారని, వరికపూడిశెల, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని, వినుకొండలో మైనార్టీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వాస్పత్రిని 100 పడకల ఆసుపత్రిగా మారుస్తానని ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేరలేదన్నారు. ఈ హామీల గురించి సిఎంను అడిగే దమ్ము ఎమ్మెల్యేకు ఉందా? అని ప్రశ్నించారు. టిడిపి అధికారంలోకి రాగానే అన్నదాతకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అన్ని జిల్లాల్లో స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేస్తామని, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేస్తామని చెప్పారు. ఉద్యోగులకు మెరుగైన పిఆర్‌సి, ఫిట్‌మెంట్ ఇస్తామన్నారు. బిసి ఉప కులాల వారీగా నిధులు, బిసిలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ సమస్య ఉన్నట్లు తెలుసుకున్నారని, వాటర్ గ్రేడ్ ద్వారా సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని, అధికారంలోకి వచ్చిన మూడు ఏళ్లలో వరికేపూడిశెల పూర్తి చేస్తామని ప్రకటించారు. వినుకొండ ప్రాంతానికి పరిశ్రమలను తెచ్చి పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, దెబ్బతిన్న రహదారులను నిర్మిస్తామని, గుండ్లకమ్మ నదిపై చెక్ డాం నిర్మించి సాగునీటి వసతి అందిస్తామని, ముస్లిం మైనార్టీలకు షాదీ ఖాన నిర్మిస్తామని, 90 శాతం పూర్తి అయిన టిడ్కో ఇల్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని హామీలు గుప్పించారు.

నేటి పాదయాత్ర వివరాలు

ఉదయం 8 గంటలకు నగరాయపాలెం క్యాంప్ సైట్ నుంచి పాదయాత్ర ప్రారంభం.

9 గంటలకు కొండ్రముట్లలో పాదయాత్ర 2300 కిలో మీటర్లకు చేరిక, శిలాఫలకం ఆవిష్కరణ.

10 గంటలకు సత్యనారాయణపురంలో స్థానికులతో సమావేశం.

11 గంటలకు కొచ్చెర్లలో స్థానికులతో సమావేశం.

మధ్యాహ్నం ఒంటిగంటకు అంగలూరులో స్థానికులతో సమావేశం.

2 గంటలకు వనికుంటలో స్థానికులతో సమావేశం.

2.15 గంటలకు వనికుంట శివారులో బస.

అట్రాసిటీ చట్టం కోరలు పీకే సంస్కరణలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలో నిందితులకు స్టేషన్ బెయిల్ ఇవ్వటాన్ని వెంటనే ఆపాలని దళిత, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా దళితుల మీద దాడులు పెరుగుతున్న నేపథ్యంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దళిత రక్షణ యాత్ర నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా అధ్యక్షులు సిహెచ్ నాగమల్లేశ్వరరావు, కె.రోశయ్యల అధ్యక్షత వహించారు. పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి మనువాద భావజాలాన్ని పెంచిపోషిస్తోందని, ఇది దళితులపై దాడులు పెరగడానికి దారితీస్తోందని ఆన్నారు. అట్రాసిటీ చట్టం కోరలు పీకడానికి మోడీ ప్రభుత్వం యత్నిస్తోందని, అయితే తీవ్ర పోరాటాల కారణంగా వెనక్కి తగ్గిందని చెప్పారు. మోడీ ప్రభుత్వం తెచ్చిన సవరణలు ప్రమాదకరమైనవని, వీటిని అమలుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. రాష్ట్రంలో దళితుల మీద దాడులు, హత్యలు, భూములను గుంజుకోవటం, కబ్జా చేయటం తీవ్రమయ్యాయని విమర్శించారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసులను అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వానికి ఏ అవసరం వచ్చినా దళితుల చేతిలో ఉన్నటువంటి భూములను నష్టపరిహారం ఇవ్వకుండా తీసుకోవడం పరిపాటైందని, దీనివల్ల భూమిలేని దళితుల సంఖ్య పెరుగుతోందని ఆందోళన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో చేపట్టే దళిత రక్షణ యాత్రను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘ్రూల నాయకులు ప్రసాద్, జి.జాన్‌పాల్, ఎన్.చిట్టిబాబు, కె.చంద్రశేఖర్, కరిముల్లా, టి.పెద్దిరాజు, జి.రవిబాబు, ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, జె.భగత్, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

బడికని వెళ్లిన బాలుడు మృత్యు ఒడికి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : నీరు నిల్వ చేసే సంపులో పడి బాలుడు మృతి చెందిన సంఘటన రొంపిచర్ల మండలం అన్నవరంలో బుధవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సుభాని, ఖాజాబి దంపులకు ఇద్దరు కుమారులు కాగా ఒక కుమారుడైన షేక్ సుభాని (4) ప్రతి రోజూ ఉదయం అంగన్వాడీ కేంద్రానికి వెళ్తాడు. అయితే బుధవారం అంగన్వాడీ కేంద్రానికి కాకుండా స్థానిక ఎస్సీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వైపు వెళ్లాడు. కాలనీ వాసులు నీటి అవసరాలకు నీరు నిల్వ చేసే సంపు వద్దకు వెళ్లిన బాలుడు సంపులోపలికి తొంగి చూస్తూ కాలు జారి లోపల పడి మృతి చెందాడు. ఇదేమీ తెలియని తల్లిదండ్రులు రెండు గంటల అనంతరం తన కుమారుడు స్కూల్ నుండి ఇంటికి రాలేదని బాలుడి తల్లిదండ్రులు వెతుకుతుండగా నీటి సంపు వద్ద బాలుని చెప్పులు కనిపించాయి. పరుగున వెళ్లి సంపులో చూడగా అందులో బాలుని మృతదేహం తేలియాడుతోంది. దీంతో మృతుని కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతునికి ఒక సోదరుడు ఉన్నాడు. మృతుని కుటుంబాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరామర్శించారు.



వామ్మో పులి

అభయారణ్యం నుండి జనారణ్యంలోకి
మాచర్ల పట్టణ శివారులో కనిపించిన పులి
బెంబేలెత్తుతున్న పట్టణ ప్రజలు

ప్రజాశక్తి - మాచర్ల

గతంలో ఎన్నడు లేని విధంగా అభయారణ్యాలలో ఉండవలసిన పులులు జన అరణ్యాలలోకి వస్తున్నాయి. అటవీ ప్రాంతంలో ఉన్న గూడేల వద్దకు పులి రావటం ఎప్పుడన్న తరుచుగా జరిగేది. కాని రణ గోణ, ధ్వనులు, ప్రకాశవంతమైన వీధి దీపాలు, అర్ధరాత్రి వరకు జన సంచారం ఉండే పట్టణాలలోకి కూడ పులులు రావటం వింతగా అనిపిస్తుంది. అభయారణ్యాలు పల్చపడటం కారణమా, పెరిగిన పులుల సంఖ్యకు తగ్గటుగా అటవీ శాఖ అధికారులు పులులు తిరిగే ప్రాంతాలలో సరైన ఏర్పాట్లు చేయకపోవటమా అన్న ప్రశ్నలు ప్రజల నుండి వస్తున్నాయి. మంగళవారం రాత్రి మాచర్ల పట్టణ శివారు ప్రాంతం, 7వ వార్డు, ఎరుకల కాలనీ పైభాగంలోని కళాకారుల కాలనీలోకి పులి రావటంతో జనాలు హడలి పోతున్నారు. సదరు కాలనీలో ఉండే మహిళ రాత్రి 9.30 ప్రాంతంలో ఇంటి ముందర అరుగు మీద కూర్చుండగా, పులి సమీపంలోకి రావటం చూసి కంగారు పడి కేకలు వేయటం తీవ్ర భయాందోళనకు గురికావటం జరిగింది. కేకలు విని పోగైన స్థానికులు ఆ ప్రాంతంలో పరిశీలన చేయగా అప్పటికే అది వెళ్ళిపోయింది. వారు పోలీసులు, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి ఆ ప్రాంతాన్ని పరిశీలన చేసి వెళ్ళారు. భయం, భయంగానే ఉంటున్న ప్రజలకు బుధవారం మధ్యాహ్న సమయంలో ప్రక్క బజారులోని ఒక మహిళకు ఇంటి వెనుక భాగంలో పులి కనిపించటంతో సదరు మహిళ పరిస్థితి దాదపు స్పృహ తప్పినంత పనైంది. షేక్ ఆషా అనే మహిళ ఇంటి వెనుక ఏదో చప్పిడు ఆవుతుండటంతో గోడ ఆవతలకి తొంగి చూడగా పిల్లిని నోట పట్టుకున్న పులి కనిపించటంతో తీవ్ర భయాందోళనకు గురై కేకలు వేసింది. స్థానికలు పోగై పరిశీలన చేసే సరికి పులి అక్కడ నుండి వెళ్ళిపోయింది. ఈ సంఘటన జరిగిన వెంటనే అటవీ శాఖ అధికారులు స్పందించి సదరు ప్రాంతంలో సదరు మహిళతో మాట్లాడి, ఆ ప్రాంతంలో పాద ముద్రల కోసం ప్రయత్నం చేశారు. నేల గట్టిగా ఉండటంతో పాదముద్రలు ఏమి లభించలేదు. ఆ ప్రాంతంలో పులి అచూకి తెలుసుకునేందుకు 6 సిసి కెమోరాలను ఏర్పాటు చేశారు. అటవీ శాఖ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ కాలనీ కళ్ళకుంట అభయారణ్యానికి సమీపంలో ఉందన్నారు. దాని వలన పులి వచ్చి ఉండవచ్చునని తెలిపారు. సిసి కెమోరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పులి అచూకి దొరికితే తదుపరి చర్యలు పై అధికారుల సూచనల మేరకు చేపడతామన్నారు. అప్పటి వరకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.





పులి అడుగుజాడలు పరిశీలిస్తున్న అటవీ అధికారులు
పులి సంచరించిన ప్రదేశాన్ని చూపుతున్న మహిళ

హత్యకేసు నమోదు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : గర్భిణీ ఉరివేసుకుని మృతి చెందిన సంఘటనపై రూరల్ పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. సత్తెనపల్లి మండలం కొమెర పూడి గ్రామానికి చెందిన కొరబండి ప్రియ అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని మృతి చెందినది. భర్త అత్తమామలు ఆడబిడ్డలు కలిసి తమ కుమార్తెను హత్యచేశారని మృతురాలి తల్లి గాలి స్వాతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతురాలి భర్త నాగేశ్వరరావు అత్తమామలు లీలమ్మ ,రోశయ్య మరిది కోటేశ్వరరావు, ఆడబిడ్డలు నాగమణి, మరియమ్మ పై రూరల్ పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మట్టి అక్రమ తరలింపు

ప్రజాశక్తి-తాడేపల్లి : ఉండవల్లిలో మట్టి మాఫియా చెలరేగిపోతుంది. ఇరిగేషన్ స్థలాలను అడ్డాగా చేసుకుని అక్రమార్జనకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మట్టి తరలించే వాహనాలకు నెంబర్ ప్లేట్లు కూడా లేకుండా తరలిస్తున్నారంటే ఏస్థాయిలో తరలింపు జరుగుతుందో అర్ధమవుతుందని స్థానికులు అంటున్నారు. రాజధానితో పాటు తాడేపల్లి ప్రాంతంలో మట్టికి డిమాండ్ విపరీతంగా ఉంది. ఇళ్ళ మెరకలకు , వివిధ నిర్మాణాల సందర్భంగా పెద్దఎత్తున మట్టి ఈ ప్రాంతంలో అవసరముంది. దీంతో మట్టిని అక్రమార్కులు తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారుల అండదండలు లేకుండా ఈ మట్టి అక్రమ తవ్వకాలు జరగవని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్ స్థలంలో యథేచ్చగా జరుగుతున్న మట్టి తవ్వరాలు ఆ శాఖ అధికారులు నియంత్రిస్తారా, చోద్యం చూస్తారా అనేది తేలాల్సి ఉంది.

కాల్వలో యువకుని మృతదేహం

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లి గ్రామానికి చెందిన పవన్ బకింగ్ హోమ్ కాలువలో బుధవారం శవమై తేలాడు. ఆదివారం నుంచి పవన్ కనిపించడంలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. మృతదేహాన్ని మంగళగిరి ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. పవన్ ఈతకు వెళ్లి పొరపాటున మృతిచెందాడా, ఎవరైనా నమ్మకంగా తీసుకెళ్లి అతన్ని చంపి కాలువలో పడేసారా అని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆ మేరకు పోలీసులు దర్యాప్తు చేయాలని కోరుతున్నారు. తమ అనుమానాలను నివృత్తి చేసి తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

సీడ్ యాక్సెస్ రోడ్డులో విద్యుత్ లైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి - తుళ్లూరు



హైకోర్టుకు దారితీసే సీడ్ యాక్సెస్ రోడ్డు,ఇతర రహదారుల్లో విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశారు. మంగళగిరి, విజయవాడ, గుంటూరుకు హైకోర్టు నుంచి న్యాయమూర్తులు, ఇతర ఉద్యోగులతో సాధారణ ప్రజలు సీడ్ యాక్సెస్ రోడ్డు,ఇతర రహదారుల్లో ప్రయాణం సాగిస్తుంటారు.రాత్రి వేళల్లో విద్యుత్ లైట్లు లేక వాహనాలు నడపడం ఇబ్బందికరంగా మారింది. దీంతో హై కోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఎ వేణు గోపాలరావు హైకోర్టులో వ్యాజ్యం వేశారు. దీనిపై కోర్టు సురక్షితమైన రహదారుల నిర్మాణం, విద్యుత్ లైట్లు ఏర్పాటు, భద్రతా చర్యలు చేపట్టాలని సి ఆర్ డి ఎ కమిషనర్ ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో సి ఆర్ డి ఎ అధికారులు విద్యుత్ లైట్లు ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేశారు. దీంతో విద్యుత్ వెలుగులతో సీడ్ యాక్సెస్ రోడ్డు కొత్త శోభను సంతరించుకుంది.

నోటీసులపై కోడెల శివరాం అభ్యంతరం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్ని ఇబ్బందులు వచ్చినా అవసరం అయితే ప్రాణాలు తీసుకుంటాం కానీ మరో పార్టీ మారబోమని టిడిపి నాయకులు కోడెల శివరాం పేర్కొన్నారు. నర్సరావుపేటలో బుధవారంఆయన మీడియాతో మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా సత్తెన పల్లిలో కోడెల శివప్రసాదరావు పేరు వినపడకుండా చేయాలని కొందరు చూస్తున్నారని విమర్శించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని కోడెల అనుచరులకు నోటీసులు ఇవ్వడాన్ని శివరాం తప్పుపట్టారు. పల్నాడు జిల్లాలో పార్టీ కోసం పోరాడుతున్నారో వారికి నోటీసులు ఇవ్వడం ఏంటని ఆయన ప్రశ్నించారు. తన అనుచరులకు జిల్లా అధ్యక్షులు జి.వి.ఆంజనేయులు నోటీసులు ఇవ్వడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. కోడెల శివప్రసాదరావు చనిపోయిన తర్వాత మా కుటుంబం ఎలా ఉందో కూడా కనీసం జివి పరామర్శిం చలేదన్నారు. కోడెలకి నివాళులు అర్పించలేదని నేను అడిగి నందుకు మా అనుచరులకి నోటీసులు ఇచ్చారని అన్నారు. కులాన్ని, పార్టీని అడ్డుపెట్టుకుని నాటకాలు ఆడేవారు అధిష్టానంకి కనపడటం లేదా అని ప్రశ్నించారు. నలబై ఏళ్ల నుండి టిడిపి జెండా మోస్తున్న వారికి నోటీసులు ఇవ్వడం ఏంటి? చిలకలూరిపేట, నరసరావుపేట, గురజాలలో పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నా వారికి ఇప్పటివరకు ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ప్రశ్నించారు. నోటీసులు ఇచ్చే ముందు కనీసం వారి అభిప్రాయాలను తీసుకునే పని లేదా ఒకపక్క పార్టీ కార్యక్రమాలు ఎవరైనా చేసుకోవచ్చు అని అధినేత చంద్రబాబు చెబుతుంటే మధ్యలో జిల్లా నాయకులు భిన్నంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. మరోవైపు మా కార్యకర్తలను నోటీసులు ఇస్తూ ఇబ్బందులు పెట్టడంలో అర్థం ఏంటన్నారు. పదవులు కోసం సత్తెనపల్లిలో ఇటీవల నాయకులు పార్టీలోకి వచ్చారని బెదిరిస్తే మేము బెదిరే వ్యక్తులం కాదనికోడెల ఆశయాలు బ్రతికించడం కోసం మేము ఎక్కడికైనా వెళతామన్నారు. పార్టీలో పదవులు కోసం వచ్చే వారికి ఉన్న విలువ నలబై ఏళ్లుగా జెండా మోసే వారికి లేకపోవడం దౌర్భాగ్యం అన్నారు. సత్తెనపల్లి, నరసరావుపేటని అన్ని రకాలుగా అభివృద్ధి చేసింది ముమ్మాటికీ కోడెల శివప్రసాదరావే మేము ఏనాడూ పదవుల కోసం ఆరాట పడలేదన్నారు. మిగిలిన నియోజకవర్గలలో పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నా సరే వారికి ఎందుకు నోటీసులు ఇవ్వడం లేదన్నారు. రాబోయే నారా లోకేష్ యువగళం పాదయాత్రలో కచ్చితంగా పాల్గొంటామయని , పాదయాత్రని విజయవంతం చేస్తామన్నారు.

కెఎల్ యులో ప్రపంచ ఎడ్యుకేషన్ ఫెయిర్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



కాలిఫోర్నియా యూనివర్సిటీ ప్రతినిధికి స్వాగతం

ప్రపంచస్థాయిలో ఉన్నత విద్యా అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ అన్నారు. బుదవారం వర్సిటీలోని సాక్ హాలులో ఏర్పాటు చేసిన ప్రపంచ ఎడ్యుకేషనల్ ఫెయిర్‌నుప్రారంభించి మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 17 అగ్రశ్రేణి యూనివర్శిటీలు తమ క్యాంపస్‌లో కొలువుదీరాయన్నారు. కెఎల్ యులో విద్యాభ్యాసం పూర్తి చేసుకుని విదేశీ విద్య పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులకు ఇది సదవకాశమని అన్నారు. ఆయా విభాగాలలో కోర్సులను పూర్తి చేసిన విద్యార్థులు విదేశాలలో ఉన్నత విద్య కోసం ధరఖాస్తు చేసుకోవడానికి ఆయా యూనివర్శిటీల ప్రతినిధులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంతర్జాతీయ సంభందాల విభాగ డైరెక్టర్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు మాట్లాడుతూ యునైటెడ్ స్టేట్స్ , యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, స్విట్జర్లాండ్, కెనడా, సింగపూర్, దుబాయ్, ఐర్లాండ్, జర్మనీ వంటి వివిధ దేశాల నుండి 17 విదేశీ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు విద్యార్థులకు పోస్ట్-గ్రాడ్యుయేషన్ కోర్సులు, అవసరాలు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు నిర్మాణం, ప్రవేశ ప్రక్రియ, వీసా పొందుకోవడం వంటి పలు అంశాలపై మార్గ నిర్దేశం చేయడానికి అందుబాటులో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారదివర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్, అంతర్జాతీయ సంభందాల విభాగ డైరెక్టర్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



వాగ్వాదంలో తహశీల్దార్, వైస్ ఎంపిపి

వైస్ ఎంపిపితో తహశీల్దార్ అనుచిత ప్రవర్తన

ప్రజాశక్తి - దాచేపల్లి

పట్టాదారు పాస్‌పుస్తకాల అంశంపై తనను తహశీల్దార్ ప్రవీణ్‌కుమార్ దుర్భాషలాడారని దాచేపల్లి వైస్ ఎంపిపి విలేకర్ల ఎదుట వాపోయారు. పట్టాదారు పాస్‌పుస్తకాలను అప్‌డేడ్ చేయించుకోవడానికి వారం రోజలుగా తిరుగుతున్నా పని చేయడం లేదని, బ్యాంకుల్లో లోన్లు చెల్లించాల్సిన కారణంగా డిజిటల్ సైన్ చేయాలని కోరానని వైఎస్ ఎంపిపి చెప్పారు. ఆపరేటర్‌ను పిలిపించాలని కోరగా తహశీల్దార్ ఆగ్రహానికి గురయ్యారని, నేను పని చేయను.. ఏం చేసుకుంటావో చేసుకో.. అన్నారని, ఎమ్మెల్యేకైనా చెప్పుకో.. నేనేమీ గాజులు తొడుక్కోలేదు.. అంటూ పరుషంగా మాట్లాడారని చెబుతున్నారు.


విద్యార్థిని పరామర్శిస్తున్న విద్యార్థి యువజన సంఘ నాయకులు

పాముకాటుకు గురైన విద్యార్థికి పరామర్శ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని నందిగామ పాఠశాలలో మూత్ర విసర్జనకు వెళ్లగా నాలుగో తరగతి విద్యార్థి అఖిల్ పాముకాటుకు గురయ్యాడు. బాధితుడు స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పట్టణ కార్యదర్శి అమూల్య, డివైఎఫ్ఐ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జె.రాజకుమార్ బుధవారం పరామర్శించారు. ఆరోగ్య వివరాలను తెలుసుకుని ధైర్యం చెప్పారు.

నాగిరెడ్డిపాలెంలో తల్లిపాల వారోత్సవాలు

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని నాగిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సిడిపిఒ అనురాధ, సెక్టార్ సూపర్వైజర్ మరియకుమారి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, అవి బిడ్డకు ఎంతో ఆరోగ్యమని వివరించారు. బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

నదీతీరంలో ఈత నిషేధం

ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని పలు ప్రాంతాల్లోని నదీతీర ప్రాంతంలో ఈతను నిషేధించినట్లు సిఐ బ్రహ్మం బుధవారం తెలిపారు. ఈ మేరకు పలు ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను పోలీసులు ఏర్పాటు చేశారు. మునుగోడు, మల్లాది, పొందుగల, ముత్తాయిపాలెం, ధరణికోట నది తీర ప్రాంతాలతో పాటు అమరావతి వైకుంటపురం ఇసుక రీచ్‌లలో ఈత కొట్టడం నిషేధమని సిఐ తెలిపారు. నిబంధనలు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





అప్పుడు కొనియాడి.. ఇప్పుడు విస్మరించి..

సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - దాచేపల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి అమరారపు సాల్మన్ మాట్లాడుతూ కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులు సేవలను కొనియాడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు పట్టించుకోవడం లేదని అన్నారు. తాను అధికారంలోకి వస్తే అందర్నీ పర్మినెంట్ చేస్తానని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి ఆ హామీలను విస్మరించారని ఆవేదన వెలిబుచ్చారు. కనీస వేతనం రూ.26 వేలు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. ఆప్కాస్ సంస్థను రద్దు చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18500 ఇవ్వాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీటికోసం 7న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు, 17న చలో విజయవాడకు కార్మికులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ధర్నాలో కె.యేబు, రాయన్న, సంజీవరావు, పుల్లమ్మ, దేవి, ఎ.నాగేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు, జ్ఞాన ఏసు పాల్గొన్నారు.

కార్మికులను విస్మరించిన అధికారులు

సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణపై 12, 13 తేదీల్లో సమావేశం

ప్రజాశక్తి -పిడుగురాళ్ల


మాట్లాడుతున్న ఆంజనేయులు నాయక్

పిడుగురాళ్ల పట్టణం కేంద్రంగా సున్నం బట్టీలు, మిల్లులు, రైస్ మిల్లుల్లో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు అసంఘటిత రంగంలో వేల సంఖ్యలో పనిచేస్తున్నారని సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్ అన్నారు. కార్మికులంతా పని భద్రత లేకపోవడంతోపాటు ప్రమాదాలకు గురవుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారని, పర్యవేక్షించాల్సిన కార్మిక శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పట్టణంలోని కన్నెగంటి హనుమంతు భవనంలో సిఐటియు విస్తృత సమావేశం సీతారామయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఆంజనేయులు నాయక్ హాజరై మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై సిఐటియు అనేక పోరాటాలు చేసిందని, ఈ నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై ఈ నెల 12, 13 తేదీల్లో జిల్లా వర్క్‌షాప్ నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, బి.నాగేశ్వరరావు, లక్ష్మీప్రసాద్, వివిధ రంగాల కార్మికులు వీరమ్మ, కృష్ణవేణి, అనంతలక్ష్మి, జె.నాగేశ్వరరావు, ఏసుబాబు, పున్నమ్మ, బుజ్జి, నరసమ్మ, మేరీగ్రేసెస్ పాల్గొన్నారు.

భూసేకరణ బాధితలతో జెసి సమావేశం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జాతీయ రహదార్ల విస్తరణలో భూములు కోల్పోనున్న రైతులతో పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ బుధవారం గురజాల ఆర్‌డిఒ కార్యాలయంలో సమావేశమయ్యారు. నాగార్జున సాగర్ డ్యామ్ నుండి వెల్దుర్తి మండలం దావుపల్లి వరకు ఏర్పాటు చేసిన జాతీయ రహదారి నెం.565, మాచర్ల నుండి దాచేపల్లి మండలంలోని నడికుడి వరకు ఏర్పాటు చేసిన జాతీయ రహదారి నెం.167 ఎడి క్రింద అదనంగా సేకరించిన భూములకు భూసేకరణ చట్టం 30/2013 కింద రైతుల వద్ద నుండి తీసుకున్న భూములలో నష్టపరిహారంపై రైతులతో మాట్లాడారు. రైతుల అభీష్టం మేరకు అధికారులు మసలుకోవాలని, రైతులకు ఏమైనా ఇబ్బందులుంటే ఆర్డీవో దృష్టికి తేవాలని సూచించారు. సమావేశంలో గురజాల డివిజన్‌లోని తహశీల్దార్లు, ఆర్‌డిఒ అద్దెయ్య, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఏర్పాట్ల పరిశీలన

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో త్వరలో నిర్వహించనున్న ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. పట్టణంలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలోని బాలుర వసతి గృహంలో అభ్యర్థులకు పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలన్నారు. పరిశీలనలో ఆర్‌డిఒ ఎం.శేషిరెడ్డి, కలెక్టరేట్ ఏవో అనిల్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

10న నులిపురుగుల నివారణ దినోత్సవం

ప్రతి ఏడాది రెండుసార్లు నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినంలో భాగంగా ఈ ఏడాది రెండో విడత కార్యక్రమాన్ని 10వ తేదీన నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ చెప్పారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను కలెక్టరేట్‌లో జెసి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం జెసి మాట్లాడుతూ 1-19 ఏళ్లలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి నూరుశాతం పూర్తి చేయాలని చెప్పారు. 1-19 ఏళ్ల వారు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో 4,15,968 మంది ఉన్నారని చెప్పారు. 10వ తేదీన ఎవరైనా మిస్ అయితే 17వ తేదీన వేయాలని అన్నారు. వీటివల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, ఎవరూ భయపడొద్దని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ శోభారాణి, డిప్యూటీ జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్, జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్, ఐసిడిఎస్ పీడీ అరుణ, పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెసి తదితరులు

పని ఒత్తిళ్లు.. అత్తెసరు జీతాలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఆశా వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం వర్తించటం లేదని, దాన్ని వెంటనే అమలు చేయడంతోపాటు సెలవులు ఇవ్వాలని, పని చేయని ఫోన్లను ఇవ్వడంతోపాటు సంబంధం లేని పనుల కోసం ఒత్తిళ్లు చేయడం ఆపాలని సిఐటియు మండల కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పండరిపురంలోని సిఐటియు కార్యాలయంలో వెంకటలక్ష్మీ అధ్యక్షతన బుధవార నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత డబ్బులతో రికార్డులు కొనాల్సి వస్తోందని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయంలోనే ఉండాలనే నిబంధనలతోపాటు సచివాలయంలో ఒక సంతకాన్ని, పీహెచ్‌సీలో ఒక సంతకాన్ని తప్పనిసరిగా పెట్టాలంటున్నారని విమర్శించారు. ఇన్ని ఇబ్బందులు పెడుతూ అరకొర జీతాలిస్తున్నారని, పైగా సంక్షేమ పథకాలు వర్తింపజేయడం లేదని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం 9న క్విట్ ఇండియా ఉద్యమం రోజు సందర్భంగా కలెక్టరేట్ వద్ద జరిగే కార్మిక-కర్షక ధర్నాలో ఆశాలూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం 12 మందితో యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా ఎస్.జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా మరియమ్మ, ఉపాధ్యక్షురాలుగా వెంకటలక్ష్మి, సహాయ కార్యదర్శిగా పి.శ్రీదేవి, కోశాధికారిగా సరస్వతి ఎన్నికయ్యారు. తొలుత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆశావర్కర్ గోవర్ధనమ్మకు నివాళులర్పించారు.

టమాట.. మున్నాళ్ల ముచ్చట..

ప్రజాశక్తి - చిలకలూరిపేట

సబ్సిడీపై టమాటాల సరఫరా మూన్నాళ్ల ముచ్చట కావడంతో ప్రజలు మళ్లీ అధిక ధరలకు కొనాల్సి వస్తోంది. టమాటా రూ.220 తోపాటు కోడిగుడ్డు రూ.10, పచ్చి మిర్చి రూ.130 పలుకుతున్నాయి. మార్కెట్లు, మాల్స్ నుండి ఇవి వీధులు, చిరు దుకాణాల్లో విక్రయాలకు వచ్చేసరికి ఇంకాస్త పెరుగుతున్నాయి. గతంలో రూ.20-30 వరకున్న కూరగాయల ధరలు ఇప్పుడు రూ.60-80 పలుకుతున్నాయి. చివరికి 130 గ్రాముల పెరుగు ప్యాకెట్ ధర రూ.12కు అమ్ముతున్నారు. గత నెల రోజుమార్చి రోజు ఐదురోజుల పాటు 58 క్వింటాళ్లను స్థానిక రైతు బజారుకు సరఫరా చేయగా ప్రజలు పెద్దపెద్ద లైన్లలో నిలబడి కొన్నారు. ఇప్పుడు వాటినీ నాణ్యత లేదనే పేరుతో నిలిపేయడంతో ఇతర వ్యాపారులు ధర మరింత పెంచి అమ్ముతున్నారు. సాధారణంగా ప్రతిరోజూ 30 క్వింటాళ్ల వరకూ టమాటాలు చిలకలూరిపేట పట్టణంలో అమ్ముడవుతాయని వ్యాపారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ధరలను నియంత్రించాలని, లేదా సబ్సిడీకి అయినా ప్రభుత్వం సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

- విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- నగరంలో విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ భారీ ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులకు 45 శాతం ఫిట్‌మెంట్‌తో వేతన సవరణ చేయాలని, కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని, తదితర డిమాండ్లతో ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక బిఆర్ స్టేడియం నుండి పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్ట్రగుల్ కమిటీ జిల్లా కన్వీనర్ దాసరి వెంకటేశ్వరరావు, ఇతర నాయకులు యన్. గురుబ్రహ్మం, పి.శ్రీనివాసరావు, ఏ.రాజేంద్రప్రసాద్, జి.నాగరాజు, జి.పవన్, శ్రీకాంత్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకపోతే ఆగస్టు 17న చలో విద్యుత్ సౌద నిర్వహిస్తామని తెలిపారు. తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులను ప్రభుత్వం, యాజమాన్యం చిన్నచూపు చూస్తుందన్నారు. 2022 పిఆర్‌సి గడువు ముగిసి 16 నెలలు దాటినా కొత్త వేతన ఒప్పందంకు యాజమాన్యం సిద్ధపడట్లేదన్నారు. ఉద్యోగులు ఎక్కువ జీతాలు తీసుకుంటున్నారని తప్పుడు ప్రచారం చేస్తూ, వేతనాలు కుదించటానికి కుట్ర చేస్తుందన్నారు. తెలంగాణలో విద్యుత్ ఉద్యోగుల కంటే మన రాష్ట్రంలో సుమారు 30శాతం తక్కువ జీతం పొందుతున్నారన్నారు. తెలంగాణలో కాంట్రాక్టు స్కిల్ కార్మికులకు నెలకు రూ.43,160లు ఇస్తుంటే, ఇక్కడ కేవలం రూ.20,598లే ఇస్తున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరిస్తామని చెప్పిన మాటలు నెరవేర్చలేదన్నారు. జెఎల్‌ఎం గ్రేడ్-2లు ప్రాణాలు పిట్టలా రాలుతున్నా యాజమాన్యానికి కనీసం మానవత్వం లేదన్నారు. మరణించిన వారి కుటుంబంలో ఒకరికి


ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, కార్మికులు

ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, పీస్‌రేట్ కార్మికులు, ముఠా కార్మికులు, ఎస్‌పిఎం తదితర అన్ని విభాగాలలో పని చేస్తున్నారని, పర్మినెంట్ ఉద్యోగుల కంటే కాంట్రాక్టు ఉద్యోగుల సంఖ్య ఎక్కువ ఉందని, చట్టప్రకారం ఈ విధులన్నీ కోర్ యాక్టివిటీ క్రిందకి వస్తాయని, కావున ఈ కార్మికులందరూ విలీనం చేసేందుకు అర్హులని తెలిపారు. కానీ ఏళ్లతరబడి వెట్టిచాకిరీ చేస్తూ పర్మినెంట్‌కు నోచుకోవట్లేదన్నారు. ఉద్యోగులు, కార్మికులు ప్రతి నెలా వేతనాలకు ఎదురు చూడాల్సి వస్తుందన్నారు. సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి యస్.ఆంజనేయులు నాయక్, సిఐటియు గుంటూరు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి విద్యుత్ రంగ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కాశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, చండీగఢ్, పాండిచ్చేరి తదితర రాష్ట్రాలలో జరిగిన సమ్మెలు, ఆందోళనలను స్ఫూర్తిగా తీసుకొని ఇక్కడి



ఎపిసిపిడిసిఎల్ ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఉద్యోగులు, కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. ర్యాలీ అనంతరం ఎపిసిపిడిసిఎల్ ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బారెడ్డి, రాంబాబు, రవి, మురళీకష్ణ, నాగరాజు, రాం ప్రభాకర్, చెన్నకేశవులు, కరిముల్లా, సందీప్, రామచంద్రయ్య, వర్మ తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా పోరుయాత్రను జయప్రదం చేయండి

తాడేపల్లిలో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తాడేపల్లి

ఐద్వా ఆధ్వర్యంలో జులై 28 నుంచి ఆగస్టు 8 వరకు జరుగుతున్న పోరుయాత్ర సందర్భంగా బుధవారం తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాస కుమారి మాట్లాడుతూ హింసపై మహిళల పోరుయాత్రకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించి సమాజ గమనాన్ని చక్కదిద్దాలని కోరారు. చిన్నారులు, మహిలలపై జరుగుతున్న హింసను అరికట్టాలని కోరారు. మరికొన్ని చట్టాలను తీసుకు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ నెల 8న విజయవాడ జింఖానా గ్రౌండ్స్‌లో జరిగే సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ అధ్యక్ష కార్యదర్శులు దొంతిరెడ్డి విజయలక్ష్మి, పి.గిరిజ, కె.మేరి, ఎం.తులసమ్మ, సుశీల, సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



జిఓ నంబర్ 108ను రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళగిరిలో నిరసన

ప్రజాశక్తి - మంగళగిరి

జిఓ నెం.108 ని రద్దు చేయాలి అని ఎస్ఎఫ్ఐ విద్యార్థుల మంగళగిరి మిద్ది సెంటర్లో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జి.ఓ 108 కాపీల దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు యం.బాలాజి మాట్లాతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వైద్య విద్యకు సంబందించిన జి.ఓ నెం.108ని ఎస్ఎఫ్ఐ వ్యతిరేకిస్తుందని అన్నారు. వైద్యవిద్యను పూర్తిగా వ్యాపారం చేయదలుచుకుని ఈ జిఓను తెచ్చారా అని ప్రశ్నిచారు. ఈ జీఓలో తెలిపిన సెల్ఫ్ ఫైనాన్స్ విధానం అత్యంత ప్రమాదకరం అని తెలిపారు. ఇప్పటిదాకా వైద్య విద్యా పేద వారికి మాత్రమే అందుబాటులో లేదని ఈ జిఓ అమలు జరిగితే మద్యతరగతి వారికి కూడా అందుబాటులో లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనార్టీలకు రిజర్వేషన్లు అమలు అయ్యే పరిస్థితులు ఇందులో కనిపించడం లేదని, ఈ విధంగా అయితే ప్రభుత్వ,ప్రైవేటు మెడికల్ కాలేజీలకు తేడా ఉండదన్నారు. వైద్యవిద్యను వ్యాపారం చేయడమే లక్ష్యంగా ఈ జిఓను ప్రభుత్వం తెచ్చినట్లు ఉందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మున్నా, రవితేజ, అఖిల్, లావణ్య, రమ్య పాల్గొన్నారు.



గుంటూరులో నిరసన ర్యాలీ


సభలో మాట్లాడుతున్న జొన్నా శివశంకర్

మణిపూర్ సిఎం రాజీనామా చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు :మణిపూర్ మారణ హోమానికి నైతిక బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని, ఇంత పెద్ద ఎత్తున హింస జరుగుతుంటే ప్రధాని మౌనం వహించటం సిగ్గుచేటని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. మణిపూర్‌లో హింసను వ్యతిరేకిస్తూ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంజీవయ్య నగర సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మణిపూర్‌లో ప్రజల మధ్య విభజన సృష్టించి, రాజకీయంగా లబ్ది పొందాలని బిజెపి ప్రయత్నం చేస్తుందన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం హింసను మరింత ప్రేరేపించే విధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు పి.దీవెనరావు, నాయకులు సీతయ్య, సారధి, రాఘవయ్యపాల్గొన్నారు.

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్ : మణిపూర్ లో జరిగిన హింసకాండను ఖండించాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు అన్నారు. మంగళవారం రాత్రి ఎంటి ఎం సీ పరిధిలోని గుండిమెడ గ్రామంలో మణిపూర్ ఘటనపై బిజెపి విధానాలను వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం జరిగింది. ఎపి కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శివ శంకరరావు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో బిజెపి నాయకులు అండదండలతోనే హింస కాండ, హత్యలు జరిగాయన్నారు. మణిపూర్ ఘటనపై ప్రధానమంత్రి మోడీ ఇప్పటివరకు నోరు విప్పకపోవడం దుర్మార్గమని అన్నారు. రాబోయే రోజుల్లో మతోన్మాద బిజెపిని గద్దె దించేందుకు ప్రజాతంత్రవాదులు, ప్రజలందరూ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మతోన్మాద బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీ జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆకురాతి జగన్ అన్నారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి, ప్రజానాట్యమండలి నాయకులు కొట్టే కరుణాకర రావు, కెవిపిఎస్ నాయకులు ఎన్.వి రాజ్, వ్యకాస తాడేపల్లి మండల కార్యదర్శి బత్తుల సంసోను, సిఐటియు నాయకులు గుడివాడ సామ్యవాదం, డివైఎఫ్ఐ నాయకులు పల్లె భార్గవ్, కెవిపిఎస్ జెట్టి రాంబాబు, పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి :మణుపూర్లో క్రైస్తవులపై, క్రైస్తవ సంస్థలపై జరుగుతున్న దాడులకు నిరసనగా తెనాలి పాస్టర్స్ అండ్ గాస్పల్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. చెంచుపేట ఉమేష్ చంద్ర విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ మార్కెట్ వంతెన, వహాబ్ రోడ్డు, బోస్ రోడ్డు మీదుగా అయితా నగర్ కూడలి, సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు సాగింది. రాష్ట్రంలో శాంతి నెలకొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతి పత్రం సమర్పించారు.


అన్నదానం ప్రారంభిస్తున్న తులసీ ధర్మచరణ్

వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అన్నదానం

ప్రజాశక్తి-గుంటూరు :గోరంట్ల మెయిన్ రోడ్డులోని వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మి పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో యర్రంశెట్టి వేణుగోపాల్, జి.సుబ్బారావు, తాళ్ల శ్రీనివాస్, తోట రంగారావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమరావతి సాధనే లక్ష్యం

- 28న మాచర్ల టు తుళ్లూరుకు మహాపాదయాత్ర
- జనం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కంభం ఆనంద్‌కుమార్
- బుద్ధి లేక వైసిపి గెలిపించానని బూటుతో కొట్టుకున్న కంభం

ప్రజాశక్తి - తుళ్లూరు

అమరావతి సాధనే లక్ష్యమని జనం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కంభం ఆనంద్ కుమార్ చెప్పారు. బుధవారం ఆయన రాజధానిలోని వెలగపూడి రైతు దీక్షా శిబిరంలో మాట్లాడుతూ, అమరావతి రాజధాని రైతుల దీక్షలకు మద్దతుగా జనం పార్టీ అధ్వర్యంలో మహా పాదయాత్ర నిర్వహించ నున్నట్లు చెప్పారు. ఈ నెల 28 వ తేదీన పల్నాడు జిల్లా మాచర్లలో ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర నుంచి పాదయాత్ర ప్రారంభ మవుతుందని అన్నారు. తుళ్లూరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద యాత్ర ముగుస్తుందని చెప్పారు. తాను ప్రజా సమస్యల కోసం పోరాడుతుంటే వైసిపి ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి జైలులో పెట్టిందన్నారు. జగన్ నిరంకుశ, నియంతత్వ పాలనకు వ్యతిరేకంగా జనం పార్టీ పనిచేస్తుందని అన్నారు. ఓట్లు వేసి వైసిపిని గెలిపించామని, తప్పు తెలుసుకున్నానని ఉద్వేగంతో తన బూట్లతో చెంపలపై కొట్టుకున్నారు. వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు అవిశ్రాంత పోరాటం చేస్తామని అన్నారు. రైతులతో కలిసి జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహా పాదయాత్ర కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అమరావతి రైతు జెఎసి నాయకులు పువ్వాడ సుధాకరరావు, జనం పార్టీ నాయకులు తెనాలి రవి బాబు, చింతపల్లి రాజు, చెల్లా రత్నరాజు, బండి అమర్, రైతులు పాల్గొన్నారు.



బూటుతో కొట్టుకుంటున్న కంభం ఆనంద్‌కుమార్

ఆరోగ్యవంతమైన సమాజమే ప్రభుత్వ లక్ష్యం

టేక్ హోం రేషన్ ప్రారంభంలో మంత్రి అంబటి రాంబాబు



మహిళలకు పోషకాహార కిట్లను అందిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

ఆరోగ్య వంతమైన సమాజమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పథకం కింద టేక్ హోం రేషన్ కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ఆరోగ్య వంతమైన సమాజం కోసం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పోషకాహార ప్రయోజత కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. అంగన్వాడీల ద్వారా నేరుగా లబ్ధిదారుని ఇంటికే ఈ కిట్లను చేరుస్తున్నట్లు చెప్పారు. తద్వారా గర్భిణులకు, చిన్నారులకు అవసరమైన పౌష్టికాహారం అందివ్వడం ద్వారా మరణాల రేటును తగ్గించి ఒక ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేయవచ్చని చెప్పారు. అనంతరం పలువురు మహిళలకు పౌష్టికాహారం కిట్లను అందించారు. కార్యక్రమంలో సిడిపిఒ శ్రీలక్ష్మి, మున్సిపల్ వైస్‌చైర్మన్లు షేక్ నాగుల్ మీరాన్, కోటేశ్వరరావు నాయక్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి : గర్భిణులు బాలింతలు రేషన్ కోసం వెళ్లి లైన్లో నిల్చోవడం ఇబ్బందికరంగా ఉంటుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని వైసిపి రాష్ట్ర నాయకులు నిమ్మా విజయ సాగర్‌బాబు అన్నారు. మండల కేంద్రమైన అమరావతిలోని పంచాయతీ కార్యాలయంలో టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. తహశీల్దార్ జె.విజయశ్రీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, తొలి విడతలో 3 కిలోల బియ్యం కిలో కందిపప్పు, 500 గ్రాముల నూనె, అటుకులు, రాగి పిండి, జొన్న పిండి, చిక్కీలు, ఖర్జూరం, 500 గ్రాముల బెల్లం, 13 గుడ్లు, 2.5 లీటర్ల పాలు అందజేయనున్నారని వివరించారు. ఎంపిపి ఎం.హనుమంతరావు, జెడ్‌పి కో-ఆప్షన్ సభ్యులు షేక్ హష్మీ, సర్పంచ్ పి.రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అచ్చంపేట : టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని మండల కేంద్రమైన అచ్చంపేటలో సర్పంచ్ కంబాల వీరబాబు ప్రారంభించగా తహశీల్దార్ కె.పద్మావతి మాట్లాడారు. ప్రతినెలా అంగన్వాడి కేంద్రాల్లో ఎఫ్ఆర్ఎస్ పద్ధతి ద్వారా పౌష్టికాహారాన్ని అందించనున్నట్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి తెలిపారు. ఎంపిపి బి.రంజిని బై కృష్ణనాయక్, ఎంపిడిఒ శివసుబ్రహ్మణ్యం, సిహెచ్ చంద్రయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కార్యక్రమన్ని చైర్మన్ ఎస్‌కె రఫాని ప్రారంభించి పౌష్టికాహారం అందించారు. వైస్ చైర్మన్ కె.శ్రీనివాసరావు, కమిషనర్ సిహెచ్. గోవిందరావు, అంగన్వాడి సూపర్వైజర్ జి.విజయ్ కుమారి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బెల్లంకొండ : మండలంలోని చంద్రాజుపాలెం అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ కొడవటి కరిముల్లా బాబూజీ, మహిళ పోలీస్ అనూష, అంగన్వాడీలు మల్లీశ్వరి, విజయకుమారి, శోభ, సీత పాల్గొన్నారు.

ప్రజాశక్తి - రాజుపాలెం : మండలంలోని గణపవరం, అంచులవారిపాలెంలో కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి టి.రాజేశ్వరి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎం.సుబ్బారెడ్డి, ఉషారాణి, అంగన్వాడీలు ప్రసన్నా, రమాదేవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు : నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో కార్యక్రమాన్ని ఎంపిపి బి.మీరయ్య ప్రారంభించారు. తహశీల్దార్ క్షమారాణి, సర్పంచ్ జి.రాజు, వి.లీల పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల : మండలంలోని సాతులూరు సచివాలయంలో కార్యక్రమాన్ని అంగన్వాడి సూపర్వైజర్ కె.పద్మ ప్రారంభించారు. వైసిపి నాయకులు జి.ఆంజనేయులు, పి.శేఖర్, ఎంపిటిసి రాజ్యలక్ష్మి, కార్యదర్శి రాఘవయ్య అంగన్వాడీలు రమాదేవి, కల్పన, విజయలక్ష్మి, అంజమ్మ, మాధవి, ఆశాలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఈపూరు : మండలంలోని కొచ్చర్ల ఎస్సీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో కిట్లను సర్పంచ్ కోపెల దేవరాజ్ పంపిణీ చేశారు. అంగన్వాడీ సూపర్వైజర్ కె.రాజ్యలక్ష్మి, మహిళా సంరక్షణ కార్యదర్శి ఆర్.బుజ్జి పాల్గొన్నారు.

త్రీఫేస్ విద్యుత్ సరఫరా పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఐదువేల జనాభా దాటిన పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి త్రీఫేస్ విద్యుత్తును సరఫరా చేయడం ద్వారా వోల్టేజ్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని కొమెరపూడిలో త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఏర్పాటుకు మంత్రి బుధవారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. విద్యుత్ శాఖ నుంచి రూ.1.5 కోట్లతో దీన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వై.వెంకటేశ్వరరెడ్డి, వైసిపి పల్నాడు జిల్లా వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి, జెడ్‌పిటిసి ఎస్.నాగేశ్వరమ్మ, నాయకులు పి.సూరిబాబు, ఆర్.పురుషోత్తమరావు, కె.విజయభాస్కర్‌రెడ్డి, విద్యుత్ డిఇ శ్రీనివాస రావు, నిర్మాణ డిఇ శ్రీనివాసరావు, ఎఇ తిరుపతిరావు పాల్గొన్నారు.

కాపు జెఎసి మండల అధ్యక్షునిగా నరసింహారావు

ప్రజాశక్తి - మాచర్ల

మండల కాపు సంఘ జెఎసి అధ్యక్షులుగా పట్టణానికి చెందిన జక్కా నరసింహారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు కురియాల ఉదయభాస్కర్ బుధవారం జక్కా నరసింహరావుకు నియామకపత్రాన్ని అందజేశారు. నరసింహరావు మాట్లాడుతూ కాపుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నరసింహారావుకు స్థానిక నాయకులు వై.శ్రీనివాసరావు, ఆర్.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, ఎన్.ప్రసాదరావు, వి.బాలశంకర్, వి.నరసింహరావు, గణేష్, ఏడుకొండలు శుభాకాంక్షలు తెలిపారు.

గాయపడిన కార్మికునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మాచర్ల

కార్మికులు ఐక్యంగా ఉంటే తోటి కార్మికులకు అవసరమైన సందర్భంలో ఆర్థికంగా సహకారం అందించేందుకు అవకాశం ఉంటుందని తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు గాజుల చెన్నయ్య అన్నారు. ఇటీవల గాయపడిన తురకా సతీష్‌కు రూ.3 వేలను స్థానిక సిపిఐ కార్యాలయంలో బుధవారం అందించారు. కార్యక్రమంలో నాయకులు బి.శ్రీనివాసరావు, రామదాసు, షేక్ మౌలాలి, నాగేశ్వరరావు, ఎం.శ్రీను, ఎస్ఎమ్‌డి బాషా పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు 17 వరకు గడువు

ప్రజాశక్తి - అచ్చంపేట

ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి ఆగస్టు 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని అచ్చంపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.పద్మ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తమ కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఇసి, ఇంగ్లీషు, తెలుగు మీడియంలో కోర్సులు ఉన్నాయని తెలిపారు. ఉత్తమ అధ్యాపకులతో బోధన, ఎంసెట్ శిక్షణను ప్రత్యేక బోధనా సిబ్బంది ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. విశాలమైన ప్రయోగశాల, తరగతి గదులు, ఉచితంగా పుస్తకాలు, ఉన్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

మహిళా ప్రగతికి మహాశక్తి : టిడిపి

ప్రజాశక్తి - పెదకూరపాడు

మహిళా ప్రగతికి మహాశక్తి పథకం ఉపయోగపడుతుందని తెలుగు మహిళ పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ ముంతాజ్ అన్నారు. బుధవారం మండలంలోని తాళ్లూరులో మహిళా పథకాలపై ప్రచారం చేసి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అనుపకళ, కె.పద్మలత, ఎస్.కుమారి, పలువురు మహిళలు పాల్గొన్నారు.





అక్రమార్కులకు అధికారుల తప్పుడు ధ్రువపత్రాలు

అక్రమ నిర్మాణాలపై చర్యల కోసం సిపిఎం ధర్నా - సర్వేయర్లపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - వినుకొండ

రెవెన్యూ అధికారులు సకాలంలో చర్యలు తీసుకోకపోవటం వల్లనే పట్టణంలోని వెన్నపూస వాగు కాలనీలో అక్రమ నిర్మాణ పనులు జరిగాయని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏవూరి గోపాలరావు విమర్శించారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేశారు. గోపాలరావు మాట్లాడుతూ వెన్నపూస వాగు కాలనీలో సర్వేనెంబర్ 333 లో 4.18 ఎకరాల ప్రభుత్వ భూమిలో 2005లో భూ పోరాటంలో భాగంగా సిపిఎం ఆధ్వర్యంలో పేదలైన 40 కుటుంబాలు ఇళ్లేసుకున్నాయని చెప్పారు. అందులో ఖాళీగా ఉన్న నాలుగు సెంట్ల ఎస్.కె రంజాన్ బీ స్వాధీనంలో ఉందని, అందులో అధికార పార్టీ అండదండలతో కొందరు అక్రమ నిర్మాణం చేపట్టారని తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేయగా ఉమ్మడిగా సర్వే చేసిన మండల, మున్సిపల్ సర్వేర్లు తప్పుడు రిపోర్టులు ఇచ్చారని మండిపడ్డారు. దీనిపై జిల్లా సర్వేర్ కు ఫిర్యాదు చేశామని, అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా సర్వే రిపోర్ట్ ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ దానిలో రెండు సెంట్లు స్థలంలో రంజాన్ బి అక్రమణ చేసి నివాసం ఉంటున్నారని తెలిపారు. సర్వేనెంబర్ 329లో 26 ఎకరాలు ఉండగా వైసిపి నాయకుడు పిడతల దేవదాసు ఆధ్వర్యంలో పిడతల అన్నబాబుకు రెండు సెంట్లు ఉన్నట్లు వినుకొండ టౌన్ సర్వేయర్ శ్రీనివాసరావు సర్టిఫికెట్ ఇవ్వడంతోపాటు పిడతల వెంకటరత్నంకు మరో రెండు సెంట్లు ఉన్నట్లు నకిలీ పత్రాలు సృష్టించారని విమర్శించారు. వాటిని ఆధారంగా చేసుకొని రంజాన్ బీ పై దౌర్జన్యం చేసి వారు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, తప్పుడు ధ్రువపత్రాలు మంజూరు చేసిన సర్వేయర్లను విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. వైసిపి నాయకులు చేస్తున్న దౌర్జన్యంపై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన ఫలితం లేకుండా పోయిందన్నారు. వైసిపి నాయకుల ఒత్తిడికి గురై ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతున్నారని, ఇప్పటికైనాన్యాయం చేయాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కె.హనుమంతరెడ్డి, పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, తిరుమల లక్ష్మి, ఎస్‌కె నాసర్‌బి, నారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి శ్యాంప్రసాద్

ఓట్ల సర్వేలో వాలంటీర్లు పాల్గొంటే ఫిర్యాదు చేయండి : జెసి

ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఓటర్ల జాబితా సవరణపై గుర్తింపు కలిగిన రాజకీయ పార్టీలతో ప్రత్యేక సమావేశాన్ని నరసరావుపేట కలెక్టరేట్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్పందన హాలులో బుధవారం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో జులై 21 నుంచి ఆగస్టు 21 వరకు బూత్ లెవల్ అధికారులు వారి పరిధిలో ఓటర్ల జాబితా సవరణ విషయం పై జరుగుతున్న సర్వేలో రాజకీయ పార్టీలు తమ పార్టీ పోలింగ్ బూత్ లెవల్ ఏజెంట్‌లను ఏర్పాటు చేసుకొని పరిశీలనలో పాల్గొనవచ్చని చెప్పారు. ఈ నెల రోజులపాటు రాజకీయ పార్టీలతో ప్రతి బుధవారం, బూత్ లెవల్ అధికారులతో ప్రతి మంగళవారం సమావేశాలు నిర్విహిస్తామని అన్నారు. ఓటర్ల జాబితా పరిశీలనలో వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామన్నారు. ఓటర్ల జాబితా సవరణలో వాలంటీర్లు పాల్గొనకుండా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు జెసిని కోరగా దీనిపై ప్రభుత్వం ఇప్పటికే స్పష్టతిచ్చిందని, వారు పాల్గొనబోరని చెప్పారు. ఈ విషయంలో ఎటువంటి ఇబ్బందులున్నా బూత్ లెవల్ స్థాయి అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు ఇవ్వొచ్చని సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఒ వినాయకం, కలెక్టరేట్ ఏవో అనీల్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
గురువారం 3 ఆగస్టు 2023

పనులు వేగవంతం చేయాలి : కమిషనర్



ప్రజాశక్తి-గుంటూరు

గడప గడపకు మన ప్రభుత్వం (జిజిఎంపి) పనులను వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జిజిఎంపి పనులను నిర్దేశిత గడువు మేరకు పూర్తి చేయాలని, రోజువారి పనుల పురోగతిపై నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే పార్కుల్లో పెండింగ్ పనులు పూర్తి చేయాలని, ఏఈల వారీగా పార్కుల్లో ఓపెన్ జిమ్, పిల్లల ప్లే ఎక్విప్‌మెంట్ మర మ్మతులు చేయాలని, అలాగే పార్కుల్లో ఖాళీ స్థలాల్లో, ప్లే కోర్టుల ఏర్పాటుకు ప్రతి పాదనలు పంపాలని ఏ.ఈ.లను ఆదేశించారు. ఏడిహెచ్‌తో ఇంజినీరింగ్ అధికారులు సమన్వయం చేసుకుంటూ పార్కుల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రధాన కాల్వల్లో వర్షాలకు ఎక్కడైనా నీరు నిలిచి ప్రజలకు ఇబ్బంది కలిగితే ఏఈ భాధ్యత వహించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా నగరంలో ప్రతి పబ్లిక్ టాయ్ లెట్‌ని మరమ్మతు చేయాలని ఆదేశించారు. రోడ్ల విస్తరణ పనులు, నాడు-నేడు పనులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులు తదితర అంశాలపై సమీక్షించారు. సమావేశంలో ఈ.ఈ.లు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో జె.సి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో ఆరోగ్యకరమైన ఓటర్ల జాబితా రూపొందించటానికి నిర్వహిస్తున్న ప్రీ రివిజన్ కార్యక్రమాల్లో భాగంగా ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం రాజకీయపార్టీల ప్రతినిధులు భాగస్వాములై అధికారులకు సహకారం అందించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి రాజ కుమారి కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో జెసి రాజకుమారి, డిఆర్ఒ కె.చంద్రశేఖర్‌రావుతో కలిసి ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్-2024కు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిం చారు. సమావేశంలో బిఎస్‌పి నాయకులు సిహెచ్.వాసు, కాంగ్రెస్ నాయకులు బి.సునీల్, టిడిపి నాయకులు కె.శివరామయ్య వైసిపి నాయకులు ఏ.జోసెఫ్‌కుమార్ పాల్గొన్నారు.జెసి మాట్లాడుతూ ఓటర్ల జాబితా డోర్ టూ డోర్ వెరిపికేషన్‌లో బీఎల్వోలను సమన్వయం చేసుకుంటూ బీఎల్ఏలు పాల్గొనేలా రాజకీయపార్టీలు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో అపార్ట్మెంట్‌లకు ఓటరు కార్డు వెరిఫికేషన్‌కు బీఎల్వోలు వచ్చిన సమయంలో వారికి అవసరమైన వివరాలు అందించేలా రాజకీయపార్టీల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఈఆర్వోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లలితా, వెంకట శివరామిరెడ్డి, నగర అదనపు కమిషనర్ పెద్దిరోజ, ఆర్డీవో ప్రభాకర్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, ఏఈఆర్వోలు డిప్యూటీ కమిషనర్ వెంకట కష్ణయ్య, సిటిప్లానర్ ప్రదీప్, డిప్యూటీ సిటిప్లానర్ కోటయ్య పాల్గొన్నారు.

ఫిరంగిపురం ఎస్ఐగా చల్లా కిషోర్



ప్రజాశక్తి - ఫిరంగిపురం : ఫిరంగిపురం మండలం నూతన ఎస్ఐగా చల్లా కిషోర్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. కిషోర్ గుంటూరులో ఇంటెలిజెన్స్ ఎస్ఐగా పనిచేస్తూ బదిలీపై ఫిరంగిపురం వచ్చారు. ఇదివరకు ఉన్న ఎస్ఐ లక్ష్మీనారాయణ రెడ్డి గుంటూరు విఆర్‌కు వెళ్లారు. నూతన ఎస్ఐ మాట్లాడుతూ మండలంలోని శాంతిభద్రతలు నెలకొల్పి ఎప్పటికప్పుడు ఫిర్యాదు దారుల సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు.

రేపు పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు : గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 4న ఉదయం 10 గంటలకు గుంటూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై. నేతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ విధానం రద్దుచేసి టెండర్ కార్మికులందరినీ కొనసాగించాలని, వర్క్ ఆర్డర్లు కార్మికులందరికీ మంజూరు చేయాలని, పెండింగ్ జీతాలు తక్షణమే చెల్లించాలని, గ్రీన్ అంబాసిడర్లుగా గతంలో పనిచేసిన వారందరినీ పనిలో కొనసాగించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, యూనిఫారం, గుర్తింపు కార్డులు, ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని తదితర సమస్యల పరిష్కారం కోసం ఈ ధర్నా జరుగుతుందన్నారు. జిల్లాలోని గ్రామపంచాయతీ వర్కర్లు అధిక సంఖ్యలో ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని నేతాజి పిలుపునిచ్చారు.

చేతిరాత పోటీల్లో సుస్మితకి మొదటి బహుమతి



ప్రజాశక్తి-గుంటూరు :మహిళల్లో సృజనాత్మకతను పెంపొందించటానికి విద్యతోపాటు, విషయ పరిజ్ఞానంపై అవగాహనకు అఖిల భారత హ్యాండ్ రైటింగ్ అండ్ కాలిగ్రఫీ అకాడమీ నిర్వహించిన పరీక్షల్లో స్థానిక హిందూ ఇంజినీరింగ్ కాలేజి ప్రొఫెసర్ కె.సుస్మిత చౌదరికి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం లభించినట్లు కాలీగ్రఫీ చేతిరాత ప్రత్యేక నిపుణులు పి.బి.చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. అకాడమీ ఆధ్వర్యంలో ప్రతి ఏటా పోటీలు నిర్వహిస్తామని ఈ ఏడాది గత నెల 20న ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన పరీక్షల్లో 4,213 మంది పాల్గొన్నట్లు చెప్పారు. ప్రొఫెసర్ సుస్మిత చౌదరికి త్వరలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ చేతులమీదుగా బహుమతి అందజేయటం జరుగుతుందన్నారు.



రైతు బజార్‌లో రూ.135కు కిలో కందిపప్పు

ప్రజాశక్తి - పొన్న రూరల్

పొన్నూరు పట్టణంలోని రైతు బజార్లో ప్రభుత్వం సబ్సిడీపై నాణ్యమైన కందిపప్పును రూ.135లకే అందిస్తున్నారని రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ నాగమణి తెలిపారు, బుధవారం రైతు బజార్లో ప్రభుత్వం అందిస్తున్న కందిపప్పును వినియోగదారులకు విక్రయించారు. బహిరంగ మార్కెట్లో అధిక రేట్లు ఉండటం వలన రాష్ట్ర ప్రభుత్వం రూ. 135లకు సబ్సిడీ కంది పప్పును అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణంలోని వినియోగదారులు ఉపయోగించుకోవాలని కోరారు.

13న 'మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్' వార్షికోత్సవం

ప్రజాశక్తి - పొన్నూరురూరల్

మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ 7వ వార్షికోత్సవం 13వ తేదీన పొన్నూరులో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్‌ను హాజరు కావాలని, బుధవారం గుంటూరు ఎస్‌పి కార్యాలయంలో ఆయన్ని కలసి అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతు అసోసియేషన్ తరపున ఎంతోమంది ప్రాణాలు కాపాడారని అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు తిరుమల శెట్టి ఉమాశంకర్, కార్యదర్శి గుడివాడ పవన్ చిల్లా అనిల్ పాల్గొన్నారు.



చైర్మన్‌ను కలిసిన పవన్‌కుమార్

ప్రజాశక్తి-తాడేపల్లి :కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరిరావును బుధవారం నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ విజేత పవన్‌కుమార్ తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో కలిశారు. నేషనల్ లెవల్‌లో నిర్వహించిన పోటీల్లో పవన్‌కుమార్ గోల్డ్‌మెడల్ సాధించాడు. నవంబర్‌లో పోర్చుగల్‌లో జరిగే అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌కు ఆయన అర్హత సాధించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడుతూ కాపు కార్పొరేషన్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. అనంతరం పవన్‌కుమార్‌ను అడపా శేషగిరిరావు సన్మానించారు. సిఎం ద్వారా సహాయ సహకారాలు అందే విధంగా చూస్తానని హామీనిచ్చారు. క్రీడాకారుల భవిష్యత్తుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పారు.

ఉపాధ్యాయుల నుంచి స్పందన

ప్రజాశక్తి-తాడేపల్లి :మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 13వ తేదీన జరిగే చిత్రలేఖనం పోటీలకు వివిధ పాఠశాలల నుంచి ఉపాధ్యాయుల స్పందన వ్యక్తమవుతుంది. బుధవారం తాడేపల్లి పట్టణంలోని సీతానగరం, కెఎల్‌రావు కాలనీ, పోలకంపాడు, మహానాడు, సుందరయ్యానగర్, విజయవాడ క్లబ్ వైపు పాఠశాలల్లో బాలోత్సవం నిర్వాహకులు పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆయా పాఠశాలల్లో అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, నిర్వాహకులు దుర్గి కోదండరామయ్య, దర్శనపు విజయ్‌బాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లిలోని బోసుబొమ్మ సెంటర్‌లో ఉన్న గంగానమ్మ గుడి అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ గుడి స్థలానికి సంబంధించిన విషయమై గతం నుంచి వివాదాలు నడుస్తున్నాయి. శంకుస్థాపన కార్యక్రమంలో మాజీ ఎంపిపి డి.వేమారెడ్డి, జె.సాంబశివరావు, బడె కోమలి, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, చింతా శ్రీరామ్, ఎం.శ్రీధర్‌రెడ్డి, టి.నాగబాబు, టి.నాగకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి :ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రస్తుతం పల్నాడు జిల్లాలో ప్రారంభమైన పాదయాత్రను జయప్రదం చేయా లని టిడిపి రాష్ట్ర నాయకులు పాలెపు రామారావు ఒక ప్రకటనలో కోరారు. మంగళగిరి నియోజకవర్గానికి పాదయాత్ర వచ్చే సందర్భంగా ప్రతి గ్రామం నుంచి టిడిపి శ్రేణులు పెద్దఎత్తున కదలాలని పిలుపునిచ్చారు యువగళం పాదయాత్రలో అనేక సమస్యలు లోకేష్ దృష్టికి వస్తున్నాయని, వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా పార్టీ పని చేస్తుందని చెప్పారు.

ఏపీఎస్పీలో ఫిజియోథెరపీ సెంటర్ ప్రారంభం



ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి ఏపీ ఎస్పీ బెటాలియన్ లో బుధవారం యూనిట్ ఫిజియోథెరపీ సెంటర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా ఏపీఎస్పీ బెటాలియన్స్ అడిషనల్ డీజీపీ అతుల్ సింగ్ ప్రారంభించారు. ఇంకా కార్యక్రమంలో ఏపీఎస్పీడీఐజి బి రాజకుమారి, ఆరవ బెటాలియన్ కమాండ్ కె ఎస్ ఎస్ వి సుబ్బారెడ్డి, అడిషనల్ కమాండ్ ఈ ఎస్ సాయి ప్రసాద్, బెటాలియన్ అసిస్టెంట్ కమాండ్లు దేవానంద్ హనుమంతు, మల్లికార్జున రావు, డిఎస్పి మురళీకష్ణ, ఆరవ బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఫిజియోథెరపీ సెంటర్లో రాష్ట్రంలో నుంచి అన్ని ఏపీఎస్పీ బెటాలియన్స్ వారికి మూడు నెలలపాటు ఎయిమ్స్ నుంచి ఫిజియోథెరపీస్టులు వచ్చి మూడు నెలల పాటు వారికి ట్రైనింగ్ ఇవ్వడం జరుపుతుందని బెటాలియన్ అధికారులు తెలిపారు.

ఎపి మైనారిటిస్ కమిషన్‌ను కలిసిన షేక్ అక్రం

ప్రజాశక్తి - మంగళగిరి : ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటిస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహమ్మద్ ఖాన్‌ను



మంగళగిరి అంజుమన్ కమిటి అధ్యక్షులు షెక్ అక్రమ్, ప్రధానకార్యదర్శి మహబుబ్ జానీ బుధవారం మర్యాద పూర్వకంగా మంగళగిరిలోని కమిషన్ ప్రధాన కార్యాలయంలో కలిసారు. మైనారిటీలకు కమిషన్ ద్వారా సంతృప్తి కరమైన సేవలు అందుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తూ పుష్పగుచ్చంతో శుభకాంక్షలు తెలిపారు. మంగళగిరి అంజుమన్ అద్యక్షునిగా ఎన్నికయిన అక్రంను కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహమ్మద్ ఖాన్ సత్కరించారు. కార్యక్ర మంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటిస్ కమిషన్ సభ్యులు సయ్యద్ హిదాయతుల్లా, షెక్ సైఫుల్లా , జితెందర్జీత్ సింగ్ పాల్గొన్నారు.



అదనపు బడ్జెట్ కేటాయింపుల ఆమోదం

ప్రజాశక్తి -మంగళగిరి :ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మంగళగిరి రాష్ట్ర గ్రంథాలయ కార్యాలయంలో చైర్మన్ ఎం శేషగిరిరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల గ్రంథాలయాల సంస్థల్లో సంబంధించిన ప్రతిపాదనలు ఆమోదించడం జరిగింది. అదేవిధంగా బడ్జెట్ అదనపు కేటాయింపుల గురించి కమిటీ సభ్యులు చర్చించి ఆమోదించారు. జిల్లా గ్రంథాలయాల సంస్థల చైర్మన్ ల అర్జీల గురించి ఈ సమావేశంలో చర్చించడం జరిగింది. ఈ సమాజంలో గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా గ్రంథాలయాల సంస్థల చైర్మన్లు పాల్గొన్నారు.



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీవీఐటీ బృందం

వివిఐటిలో సాంకేతిక సదస్సు

ప్రజాశక్తి - తెనాలి

వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల నంబూరులో ఈనెల 10, 11 తేదీలలో స్వర్ధ 2కె23 సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ బుధవారం తెలిపారు. అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మిషనరీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమం బ్రోచర్లను విద్యాసాగర్‌తో పాటు అధ్యాపక బృందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ సదస్సులో కోడ్ హజల్, టెక్ ట్రగ్, బగ్ క్రష్, పజిల్ ప్యారడాక్స్ వంటి సాంకేతిక అంశాలపై పోటీలు జరుగుతాయి అన్నారు. విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాల పెంపుదల, సామాజిక మాధ్యమాల వినియోగంపై దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాయాల నుంచి వస్తున్న అధ్యాపకులు వివరిస్తారన్నారు. సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న సాంకేతిక కళాశాలలకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులంతా పాల్గొనవచ్చునన్నారు. పాల్గొనదలచిన వారు ఎసిఎం.వివిఐటిగుంటూరు.కాం లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జున రెడ్డి, అక్కడ మీకు డీన్ డాక్టర్ కే గిరిబాబు, అడ్మిన్ డీన్ డాక్టర్ కుమార్ స్వామి పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో గుంటూరు తూర్పులో
నీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు నగరంలోని తూర్పు నియోజక వర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో రేపు, ఎల్లుండి తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటకృష్ణాపురం, ఉప్పలపాడు గ్రామాలకు తాగునీరు సరఫరా చేయటానికి తక్కెళ్లపాడు జాతీయ రహదారి వద్ద ఇంటర్ కనెక్షన్ పనుల కోసం సంఘం జాగర్లమూడి వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిలుపుదల చేయాల్సి ఉందన్నారు. దీని వల్ల 4వ తేదీ సాయంత్రం నుండి 5వ తేదీ ఉదయం వరకూ ఎల్‌ఎల్‌ఆర్ రిజర్వాయర్ పరిధిలోని అన్ని ప్రాంతాలు, అలాగే ఎల్‌బి నగర్ రిజర్వాయర్ పరిధిలోని వినోబా నగర్, మారుతీ నగర్, జాకీర్ హుస్సేన్ నగర్ ప్రాంతాలకు త్రాగునీటి అంతరాయం ఏర్పడుతుందని, కావున ప్రజలు ముందుస్తు ఏర్పాట్లు చేసుకొని, జిఎంసికి సహకరించాలని కోరారు. ఆదివారం ఉదయం యదావిధిగా సరఫరా జరుగుతుందని చెప్పారు.

ఆయుష్ విభాగాన్ని పరిశుభ్రంగా ఉంచండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి ప్రభుత్వ యునాని, నాచురోపతి ఒ పి లను సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ బుధవారం ఆయన పరిశీలించారు. ఈ విభాగంపై ఫిర్యాదులు రావడంతో ఆయన తనిఖీ చేశారు. ఒపిలో ఫైళ్లన్ని దుమ్ము కొట్టుకోవడాన్ని ఆయన గమనించారు. ఆసుపత్రి వాతావరణం పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఒపిలో ఉన్న వైద్యుల పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ ఆయుర్వేదిక్, హోమియోపతిలను కూడా రోగులకు అందుబాటులో ఉంచాలని కోరారు. ఎవరు కూడా ఆపనిందలు పడాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను ప్రైవేట్ ఆసుపత్రికి పంపిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటి పద్ధతులు మానుకోవాలని ఆయన సూచించారు. నాచురోపతిలో ఒక వైద్యుడు, యునానీ విభాగంలో ఇద్దరు మాత్రమే పని చేస్తున్నారని అన్నారు. వారంలో మూడు రోజులు మాత్రమే సిబ్బంది పని చేస్తున్నారని ఆయన చెప్పారు. సూపరింటెండెంట్ వెంట డాక్టర్ శ్రావణ్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని పాల్గొన్నారు.



ఎన్నికల సంఘం సమీక్షలో పాల్గొన్న కలెక్టర్

ప్రజాశక్తి- గుంటూరు

కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ సమ్మరి రివిజన్-2024పై ఆగష్టు 2, 3 తేదీల్లో రెండ్రోజులపాటు రాష్ట్రంలోని కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో విశాఖపట్నంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి సమీక్షా సమావేశంలో మొదటిరోజు జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమీక్షా సమావేశాన్ని సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ దేవేంద్రశర్మ, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్‌మీనా ప్రారంభించారు.



కిట్స్‌లో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో మూడు రోజులపాటు డిజైన్ థింకింగ్, క్రిటికల్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్‌పై మూడురోజుల వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ అండ్ లాజిస్టిక్స్ చండీదాస్ చక్రబోర్తి జిఎపిసిఆర్‌యుడి ఫౌండర్ అటాను రాయ్‌చౌదరి పాల్గొని ప్రసంగించారు. ఈ వర్క్‌షాప్‌లో సిఎస్‌ఈ ఇంజినీరింగ్ 3వ సంవత్సరం విద్యార్థులు పాల్గొన్నారు. మొదటిరోజు వర్క్‌షాప్‌లో విద్యార్థులకు వారి ఆవిష్కరణలను ఎలా అభివృద్ధి చేయాలో క్యాప్సూల్ ల్యాబ్ వారు సూచించారు. రెండో రోజు విద్యార్థుల ఆలోచనలకు వ్యాపార నమూనాని తయారు చేయాలన్నారు. 3వ రోజు విద్యార్థుల ఆవిష్కరణలను నిశితంగా పరిశీలించి, మొదటి మూడు ఉన్నతమైన, వినూత్నమైన ఆవిష్కరణలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ ఆధునిక పద్దతులు, టెక్నాలజీని ప్రతి విద్యార్థి నేర్చుకొని ఇండస్ట్రీకి కావాల్సిన నైపుణ్యాన్ని కళాశాలలోనే నేర్చుకోవటం మంచిదని తెలియజేశారు. కళాశాల సెక్రెటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ వర్క్‌షాప్‌ల ద్వారా విద్యార్థులు ప్రతిభను పెంపొందించాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, సిఎస్ఇ విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.రమేష్ ప్రసంగించారు.

టిజెపిఎస్ ఎన్ఎస్ఎస్ అధికారిగా శైలజ

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక టిజెపియస్ కళాశాల జాతీయ సేవా పథకం నిర్వహణ అధికారిగా కళాశాల సంస్కృత అధ్యాపకురాలు ఆర్.జయ శైలజను ఏఎన్‌యు జాతీయ సేవా పథకం విభాగం వారు నియమించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎబిపి మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏఎన్‌యు జాతీయ సేవా పథకం అసిస్టెంట్ కో ఆర్డినేటర్ డాక్టర్. డి. రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా కళాశాలలో పచ్చదనం, పరిశుభ్రత, మెడికల్ క్యాంప్‌లు, చెట్లు పెంచడం, సమాజంలో ఉండే రుగ్మతలపైన వర్క్ షాప్‌లు నిర్వహించడం, సీజనల్ వ్యాధులపై అవగాహన, వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జయశైలజకు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



శైలజను అభినందిస్తున్న రవిశంకర్ రెడ్డి

ఎరువుల గోడౌన్‌లో అధికారులు తనిఖీ
రూ.1.25 కోట్ల విలువైన నిల్వలు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు : వ్యవసాయశాఖాధికారులు బుధ వారం స్థానిక ఏటుకూరు రోడ్డులోని వెంగ మాంగ ఎస్టేట్స్‌లోని శ్రీబాలాజీ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ ఎరువుల గోడౌన్‌లో తనిఖీలు నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు గోడౌన్‌ను తనిఖీ చేసి, అధి కారులకు పలు సూచనలు చేశారు. స్వాధీనం చేసుకున్న ఎరువులను పరీక్షల నమిత్తం నమూనాలు సేకరించాలని ఆదేశించారు. రూ.1.25 కోట్లు విలువ గల 125.6 మెట్రిక్ టన్నుల సూక్ష్మ పోషక ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. గోడౌన్ మేనేజర్ కుశాల్ తివారీ హైదరాబాద్ నుండి అనుమతి లేని ఎరువులను 25 కిలోల బస్తాలు తెప్పించి వాటిని రకరకాల పేర్లతో ఒక కిలో ప్యాకెట్లు చేసి, అమ్ముతున్నారని అధికారులు తెలిపారు. టింకో కెమికల్స్ మహారాష్ట్ర పేరుతో తయారవుతున్నట్లు, కాల్షియం నైట్రేట్, ఎంఎపి, పొటాషియం సల్ఫేట్, 19-19-19 మొదలైన ఎరువులు తయారు చేసి, డీలర్లకు సరఫరా చేస్తున్నట్లు తనిఖీలో అధికారులు గుర్తించారు. ఎరువు లను స్వాధీనం చేసుకొని, క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు సహాయ వ్యవసాయ సంచాలకులు టి.శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ వ్యవసాయాధికారులు బి.కిషోర్, బి.అంజిరెడ్డి, కొల్లిపర వ్యవసాయా ధికారి కె.వెంకటరావు, విఆర్ఎ జి.నాగేశ్వర రావు, విఆర్ఒ రమాదేవి పాల్గొన్నారు.



ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న డిఎఒ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు

మోడీ విధానాలను తిప్పికొట్టాలి

ట్రేడ్ యూనియన్ల సదస్సులో వక్తలు - 9న విజయవాడ ధర్నాకు వేలాదిగా తరలి రావాలని పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 9వ తేదీన క్విట్ ఇండియా డే సందర్భంగా 'మోడీ హటావో - దేశ్ బచావో' పేరుతో విజయవాడలో జరిగే మహా ధర్నాకు వేలాదిమంది కార్మికులు తరలిరావాలని ఆలిండియా ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. వివిధ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో బుధవారం పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో జిల్లా కార్మిక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాధాకష్ణమూర్తి, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం రామకష్ణ, ఏపీ.ఎఫ్.టి.యు నాయకులు కోటయ్య మాట్లాడుతూ కేంద్రం అనుసరిస్తున్న విధానాలను తిప్పి కొట్టకపోతే కార్మిక వర్గ మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని అన్నారు. దేశభక్తి ముసుగులో ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ, కలిసి ఉన్న ప్రజల మధ్య చిచ్చు రాజేసేందుకు ప్రయత్నిస్తున్న బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద విధానాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సుకు సిఐటియు జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అరుణ్ కుమార్, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కష్ణ అధ్యక్షత వహించారు. సదస్సులో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాసరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి హనుమంతురావు, సిఐటియు పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి బి ముత్యాలరావు, ఆది నికల్సన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దయా రమాదేవి

ప్రజాస్వామ్యానికి ఓటు పునాది

వర్సిటీలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ను ప్రారంభించిన విసి

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని, దేశ రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించడానికి ఓటు హక్కు ఉపయోగపడుతుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య పి.రాజశేఖర్ తెలిపారు. బుధవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో 'ఎలెక్టోరల్ లిటరసీ క్లబ్' ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య పి. రాజశేఖర్ మాట్లాడుతూ మన దేశానికి యువశక్తి గొప్ప నిధి అని, ఇలాంటి యువతకు ఓటు హక్కు పై అవగాహన అత్యంత అవసరమన్నారు. 18 సంవత్సరాలు నిండిన విశ్వవిద్యాలయ పరిసర ప్రాంతాలలోని యువత ఈ 'ఎలెక్టోరల్ లిటరసీ క్లబ్' సేవలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య పి. వరప్రసాద మూర్తి మాట్లాడుతూ 'ఓటు' అనే రెండక్షరాల పదం దేశ చరిత్రనే మార్చేస్తుందని తెలిపారు. 1988వ సంవత్సరంలో 61వ రాజ్యాంగ సవరణ ఆమోదించబడి లోక్ సభ, రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికల ఓటింగ్ వయస్సును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించడం జరిగినదని విద్యార్థులకు నాటి సంఘటనలను వివరించారు. విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ నిర్వాహకులను అభినందించారు. ఆచార్య శ్రీనివాసరెడ్డి ఈ క్లబ్ నిర్వాహకుడిగా బాధ్యతలు చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వివిధ కళాశాలల, విభాగాల ఆచార్యులు కె.గంగాధర్, పి.సిద్దయ్య, ఇ. శ్రీనివాసరెడ్డి, ప్రమీలా రాణి, మధుబాబు, సునీత, గోపి కృష్ణ, నాగరాజు, ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.



కెఎల్‌యు అధ్యాపకుడికి పిహెచ్‌డి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : కెఎల్‌యు డీమ్డ్ యూనివర్శిటీలో గత 20 సంవత్సరాలుగా కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఆచార్య జి.దినేష్ కుమార్ పిహెచ్‌డి పట్టా పొందారని సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ టి.పవన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్ సర్వీసెస్, క్లౌడ్ కంప్యూటింగ్ అంశాలపైన గత ఏడు సంవత్సరాలుగా చేసిన పరిశోధనా ఫలితంగా పిహెచ్‌డి సాధించిన ఆచార్య జి.దినేష్ కుమార్ మాట్లాడుతూ సర్వీస్ ప్రొవైడర్ మరియు వినియోగదారుల మధ్య, సేవల అంగీకార పద్ధతిని ఉపయోగించి, అంతర్జాల సేవలలో జరిగే వైఫల్యాలను తగ్గించేందుకు తమ పరిశోధన ఉపయోగ పడుతుంది అని వివరించారు. దీనిపైన అంతర్జాతీయ స్థాయిలో 4 పరిశోధనా పత్రాలను ప్రచురించినట్లు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయ చైర్మన్ కోనేరు సత్యన్నారాయణ, వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ, ప్రొఫెసర్ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు దినేష్‌ను అభినందించారు.



పింగళి వెంకయ్యకు జేసీ నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా బుధవారం కలె క్టరేట్‌లోని పింగళి వెంకయ్య విగ్రహానికి జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజ కుమారి, డిఆర్ఒ కె.చంద్రశేఖర్ రావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలితా, ఆర్‌డిఒ ప్రభాకర్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ హరి హరనాథ్, జిల్లా టూరిజం అధికారి నాయుడమ్మ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జెసి, డిఆర్ఒ తదితరులు